
# ఎరుపు మరకలు

సదానంద్ శారద




అది శనివారం సాయంకాలం కనుక బాబుమొహం ఎంతోఆనందంగా ఉంది.

మరునాడు బడి ఉండదు. బస్సులకోసం పరుగు ఉండదు.

అదీగాక ఆ రోజు నాన్న తనను పార్కుకు తీసుకపోతానన్నాడు.

అలా అనడం ఏ ఇరవైసార్లో అయినా ఎన్నడూ వాళ్ళ నాన్న బాబును పార్కుకు తీసుకపోలేదు. ఏ షికారుకు తీసుకపోలేదు. అయినా అన్నప్పుడల్లా ఆ రోజు నాన్న తనను పార్కుకు తీసుకపోతాడనే బాబు నమ్మకం.

తను పార్కులో ఆడుకోబోయే బంతి ఆటను ఊహించుకుంటున్నాడు బాబు. డాబామీద నిల్చుంటె దూరంగా తండ్రి బస్సుదిగి వచ్చేది కనిపిస్తుంది.

నాలుగ్గంటలకే ముస్తాబై నాన్నకోసం ఎదురుచూస్తూ డాబామీద నిల్చున్నాడు బాబు. ఆ రోజు ముందుగా వస్తానని చెప్పాడు కూడా తండ్రి.

డాబామీద నిల్చున్న బాబుకు మురికి రోడ్డు, మున్సిపాలిటీ చెత్తకుండి కనిపిస్తున్నాయి.

రోడ్డుమీద సజీవంగా పారే డ్రైనేజి నీళ్ళలోంచి మిక్చర్ బండి నెట్టుకుంటూ పోతున్నాడు సాంబయ్యతాత.

సావిత్రి పేన్ల తల గోక్కుంటూ గద్దె మీద నిల్చొని చూస్తున్నది.

సాంబయ్యతాత గంట మోగించాడు. పిల్లలు మిక్చర్‌బండి చుట్టూ మూగుతున్నారు.

డబ్బులున్నవాళ్ళు కొనుక్కొని ఊరించుకుంటూ తింటున్నారు. లేనివాళ్ళు తింటున్నవాళ్ళను తినేసేలాచూస్తున్నారు.

బురదస్నానం చేసిన ఓ కుక్కపిల్ల తోక ఆడిస్తూ దూరంగా నిల్చుంది.

మిక్చర్ తింటున్న పిల్లల్లో ఒకరు ఏదో కిందపడేశారు తమాషాకు....

అది తినే వస్తువనుకుని కుక్కపిల్ల ఒక్క జంప్ చేసింది ముందుకు.... అక్కడ తినే పదార్థమేదీ దొరక్క తన ప్రతాపం వృధాకావడం ఇష్టంలేక నీళ్ళలో తిరుగుతున్న పందిపిల్లల్ని దూరంగా తరిమి తరిమి.... తిరిగొచ్చి తోకాడిస్తూ నిల్చుంది.

ప్రభుత్వ కల్లుదుకాణం ముందు 'సీకులు' అమ్ముతున్నాడు తన దోస్త్ రాజిగాని తండ్రి.

ప్రభుత్వ సారాదుకాణం ముందు మసాలా గారెలు అమ్ముతోంది సారాజ్జెం తల్లి....

కాగితం చుట్టిన సీసాను అంగిచాటున ఇంటికితీసుకపోతున్నాడు మనోహర్.... వాళ్ళ నాన్నకు విస్కీబాటిల్ కాబోలు....

లత చిల్లర పడేసుకున్నట్టుంది. రోడ్డుమీది డ్రైనేజినీళ్ళలోవెదుకుతున్నది.

వెంకటేశు కూడా ఆ అమ్మాయికి సహాయంగా నీళ్ళను కాళ్ళతో చిమ్మి వెదుకుతున్నాడు.

"మా నాన్న సిగరెట్లు తెమ్మన్నాడు. కొనుక్కునేందుకు కాదు...." అంది లత.

వెంకటేశు నిరుత్సాహంగా చూశాడు.

విమల కాగితంపడవలు తెచ్చి డ్రైనేజి నీళ్ళలో వదులుతున్నది.

విమలకు డ్రైనేజి నీళ్ళంటే ఇష్టం.... కాగితం పడవల్ని మోసుకపోతాయి కదా!....

డాబామీది బాబును చూసి విమల చేయి ఊపింది రమ్మని—

బాబు రానన్నాడు.

'నీ దోస్తకచ్చ' అనిచిటిక నేలూపింది.

నిజానికి బాబుకు విమలతో నీళ్ళలో కాగితం పడవల్ని వదలాలని ఉంది.

కాని బురద చిల్లి దుస్తులి పాడవుతా యేమో....

నాన్నతో షికారుకు వెళ్ళడానికి వేసు కున్న ఆ దుస్తులు మరకలు కావడం బాబు కిష్టంలేదు.

సాక్స్, షూస్ కూడా వేసుకున్నాడు.

తానలా చక్కగా ముస్తాబై రెడీగా ఉంటె నాన్న సంతోషిస్తాడని.... తప్పక తనను పార్కుకు తీసుకపోతాడని ఆశగా ఎదురుచూస్తున్నాడు బాబు.

తాను పార్కులో ఆడబోయే ఆటల్ని ఊహించుకొని సంబరపడుతూ విమల బెదిరింపును లెఖ్ఖచేయలేదు.... పైగా నీ దోస్త్ కూడా కచ్చ అని తనూ చిటిక నేలు ఊపాడు.

కిరోసిన్ దొరకలేదు కాబోలు.... కరీం అవలీలగా డబ్బాను ఊపుతూ రేషన్‌షాప్ నుంచి వస్తున్నాడు.

డేవిడ్ బెల్లం కాబోలు కొనుక్కు పోతూ ఓ పెద్ద తీసి నోట్లో వేసుకున్నాడు.

"మీ మమ్మితో చెప్తాను...." సీను బెదిరిస్తే వాడికీ ఓ ముక్క తీసిచ్చాడు.

డాబామీది నుంచి బాబు చూస్తున్నా డని గమనించి నీక్కూడా ఇస్తాను రమ్మన్నట్టు సైగ చేశాడు.

బాబు రానని తల అడ్డంగా తిప్పాడు.

"ఇప్పుడు మా నాన్న నన్ను పార్కుకు తీసుకపోతడు...." గట్టిగా సీనుకు, బాబుకు వినిపించేట్టు చెప్పాడు బాబు.

"మా మమ్మీ కూడా సండేనాడు నన్ను పార్క్‌కు, మ్యూజియంకు తీసుకపోతానని చెప్పింది...." అన్నాడు బిగ్గరగా డేవిడ్.

"ఒరేయ్, డేవిడ్ అదిగో మీ మమ్మీ బయటికొచ్చి చూస్తోందిరా.... నీ కోసమే కావచ్చు—" అని చెప్పాడు సీను.

డేవిడ్ వెంటనే అక్కణ్నుంచి పరుగుతీశాడు.

సీను మెల్లగా డాబామీదికి వచ్చి— "ఈ డ్రెస్ చాలా బాగుంది బాబూ.... ఇప్పుడే పోతారా పార్క్‌కు?" అని అడిగాడు.

"అవును...." అన్నాడు బాబు.

"నేనూ రానా...."

"రా...."

"మీ నాన్న కోప్పడతారేమో...."

"ఏం కోప్పడడు.... ఏం చక్కా

మనమిద్దరం పార్క్‌లో బాల్ ఆడుకో వచ్చు...."

"మా అమ్మకు చెప్పిరానా...."

"ఊఁ వెళ్ళు మరి...."

సీను గబగబా వెళ్ళిపోయాడు.

మరో అరగంటసేపు బాబు తండ్రి కోసం ఎదురుచూస్తూ అలాగే నిల్చు న్నాడు.

తల్లి రెండుసార్లు వచ్చి పిలిచింది— కిందికి రమ్మని. "ఉహుఁ....నాన్న వచ్చే దాకా రాను—" అన్నాడు బాబు.

మరో పావుగంటకు సీను వచ్చాడు దీన వదనంతో—

"మా అమ్మా నాన్నా మంచివాళ్ళు కాదు— నన్ను ఎటూ పోనివ్వరు.... ఎటూ తీసుకపోరు...." విచారంగా బాబుతో అన్నాడు సీను.

"మా నాన్న పార్క్‌కు తీసుక పోతాను— వచ్చేసరికి రెడీగా ఉండమని చెప్పాడు—" అంటూ గర్వంగా చూశాడు బాబు.

"ఎప్పుడూ ఇంట్లోనే ఆడుకోవాలంటే బోర్ కాదా.... మీ నాన్న చాలా మంచి వారు.... నిన్ను షికారుకు తీసుక పోతారు...."

"పోయిన సండేనే పోయేవాళ్ళం— కాని మా నాన్నకు అర్జంటుగా ఏదో పని పడింది...."

"మా నాన్నకు అర్జంటు పనులు లేకున్నా ఎటూ తీసుకపోరు.... ఒకసారి జూకు మాత్రం తీసుకపొమ్మంటె.... ఎంత ఏడ్చినా తీసుకపోలేదు— మా అమ్మ కొట్టింది— నాన్న కొట్టాడు...."

"ఛాఛా.... మా నాన్న ఎప్పుడూ కొట్టడు."

"మా నాన్నకు కోపం ఎక్కువ— చిన్నప్పుడు నల్లమందు పోశారట.... మా నాన్నమ్మ చెప్పింది...."

"బాబూ.... టిఫిన్ తిందువుగాని రా నాన్నా...." బాబువాళ్ళమ్మ మరో సారి పిలిచింది.

"నేను వెళ్తాన్రా బాబూ...." సీను వెళ్ళిపోయాడు.

"నాన్న వచ్చాక తింటానమ్మా...."

తను టిఫిన్ తినడానికి వెళ్తే నాన్న వస్తాడేమో.... మరి అంతసేపు తను డాబామీద నిల్చొని ఎదురుచూసినట్టు నాన్న కెలా తెలుస్తుంది.... అంచేత అక్కణ్ణుంచి కదలడం బాబు కిష్టం లేదు. అక్కడికే టిఫిన్ తెచ్చి తినిపించింది తల్లి.

అలా సాయంకాలం ఆరున్నరదాకా ఆశ ఆ చిన్నారి కళ్ళలో నిల్చింది....

ఆ తరువాత మెల్లమెల్లగా నగరాన్ని కప్పేసిన చీకటి ఆ కళ్ళలోని ఆశను మింగేసింది. బాబువాళ్ళ నాన్న ఆఫీసు నుంచి రాలేదు— బిక్కమొగంతో ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నాడు బాబు.

"రా నాన్నా.... ఎంతసేపు ఇక్క—

డుంటావ్?" తల్లి వచ్చి బాబును ఎత్తు కొని భుజంమీద వేసుకుంది.

బాబు రానని మారాంచేశాడు.

తల్లి బుజ్జగించి కిందికి తీసుక పోయింది.

చీకటిని, కాళ్ళ షూస్‌ను చూస్తుంటే .... సీను మాటలు గుర్తుకొస్తుంటే బాబుకు దుఃఖం ఆగలేదు.

తాను పార్కులో ఆడుకుందామను కున్న ఆటలు.... తినాలనుకున్న ఐస్ క్రీం గుర్తుకొచ్చి బాబు తల్లి భుజం మీద నిలవక ఏడుస్తూ కిందికి జార బోయాడు.

"నాన్న కేదో అర్జంటు పని పడింది కాబోలు నాన్నా.... రేపు సండే కదా.... ఆఫీసుండదు. ఎంచక్కా పొద్దున్నే పోయి సాయంకాలందాకా ఆడుకోవచ్చు. మధ్యాహ్నం పార్కులోనే భోంచేద్దాం —నేను కూడా మీతో రావాలా లేదా...." బాబు కళ్లు తుడుస్తూ అడిగింది తల్లి.

రమ్మన్నట్టు తలూపాడు....

కొంచెంసేపు మనసు మారాంచేసినా .... చివరికి తల్లి బుజ్జగింపులో కరిగి పోయి ఆమె చెప్పినట్టు విన్నాడు బాబు—

అన్నం తిని కాస్సేపు చదువుకొని .... మరునాటి ప్రోగ్రాంను ఊహించు కుంటూ నిద్రపోయాడు........

* * *

రాత్రి పది దాటాక తూలుతూ ఇల్లు చేరుకున్నాడు బాబు తండ్రి సారంగపాణి.

బాబు పార్కుకు పోడానికి రెడీఅయి ఎంతసేపు డాబామీద నిల్చొని ఎదురు చూసింది చెబుతామనుకుంది బాబు తల్లి కావేరి.

కాని భర్త స్థితిని గమనించి ఆమె మౌనంగా ఉండిపోయింది....

* * *

మరునాడు పొద్దున్నే లేచిన బాబు తండ్రి కోసం చూశాడు. తండ్రి ఇంకా నిద్రపోతున్నాడు.

"అమ్మా.... నాన్న నేను నిద్ర పోయాక వచ్చాడా?" తల్లిని అడిగాడు బాబు.

"ఆఁ...."

"అర్జంటు పని పడిందటనా...."

"ఆఁ...."

"ఇప్పుడు తొందరగా తయారై మనం పార్కుకు పోదామా?"

మౌనంగా తలూపింది కావేరి.

బాబు గబగబా స్నానం చేశాడు. తల్లి పెట్టిన టిఫిన్ తిన్నాడు— నిన్నటిలాగే డ్రెస్ వేసుకొని, షూస్ తొడుక్కున్నాడు—

సీను పొద్దున్నే వచ్చాడు—

సీను అడగక ముందే తానే చెప్పాడు బాబు— "మా అమ్మ, నాన్న, నేను పార్కుకు పోతున్నాం తెలుసా ఇవ్వాళ— మధ్యాహ్నం భోజనం కూడా అక్కడే చేస్తాం.... ఎంచక్కా పొద్దట్నించి సాయంకాలం దాకా ఆడుకోవచ్చు...."

"నిన్న పోలేదా?.... మా గడపల్లో




నిల్చొని చాలాసేపు చూశా్రనా.... మీ రెప్పుడు పార్కుకు పోతారో చూద్దామని...." అన్నాడు సీను-

"సాయంకాలం వెళ్లి ఆడుకోడానికి ఎక్కువ టైముండదు. అసలు పార్కుకు పోతే సండేరోజే పోవాలి...."

"అయితే ఇవ్వాళ తప్పకుండా పోతారా?"

"ఆఁ.... మా నాన్న అబద్ధం ఆడడు తెలుసా...." స్నేహితునితో గర్వంగా చెప్పుకున్నాడు బాబు.

* * *

సారంగపాణి స్నానంచేసి సినిమా పత్రిక చూస్తూ కూర్చున్నాడు-

మెల్లగా వచ్చాడు బాబు-

"నాన్నా...." అని పిలిచాడు.

తలెత్తి చూశాడు తండ్రి-

"మరే.... నిన్న పార్కుకు పోదామన్నావుగా...."

"పార్కుకా!...."

ఆ విషయమే గుర్తుకులేదు సారంగపాణికి.

నాయకుల్లాగే తలిదండ్రులు వాగ్దానాలు చేసి మరచిపోతుంటారు. వాటిని పిల్లలు సీరియస్‌గా తీసుకుంటారని గమనించరు-

"నిన్న ఆఫీసునుంచి వచ్చేసరికి రెడీ అయి ఉండమన్నావుగా...."

"ఆఁ....వీలుపడలెదు.... మరోసారి ఎప్పుడైనా పోదాంలె...."

"అమ్మ ఇవ్వాళ వెళ్దాం అంది...."

"ఇవ్వాళా... ఉహుఁ... కుదరదు..".

"వెళ్దాం నాన్నా...."

"కుదరదంటె నీక్కాదూ- చదువుకో ఫో...." విసుక్కున్నాడు సారంగపాణి-

దీనంగా.... బిక్క మొగం వేసుకొని చూశాడు బాబు.

"పోరా.... హోంవర్క్ చేసుకో పో...."

బాబు అక్కడే నిలబడటం చూసి కసురుకున్నాడు-

కొడుకు ముందు సినిమా బొమ్మల్ని చూడటం ఎంబరాసింగ్‌గా ఉంటుంది అతనికి....

ఆ సమయంలో "ఈ లెక్క రావడం లేదు నాన్నా.... కొంచెం చెప్పవూ...." అని కొడుకు వచ్చినా అట్లాగే కసురుకుంటాడు.

ఇప్పుడు నాకు వీలుపడదు- మీ అమ్మను చెప్పమను పో అంటాడు- ఒక్కోసారి తరువాత చేసుకుందువులే ఇప్పుడు ఆడుకో పో.... అంటాడు....

బాబు పొంగివచ్చే దుఃఖంతో అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు-

వంటింటి తలుపును గోడకేసి బాదుతూ ఏడ్వసాగాడు.

"ఏవిట్రా అది.... నాన కోప్పడతారు- హోంవర్క్ చేసుకో పో...."

"ఊఁ.... ఊఁ.... మరి పార్కుకు పోదాం అన్నావుగా...."

"ఇంకోసారి ఎప్పుడైనా పోదాంలె..."

"లేదు.... ఇప్పుడే పోవాలి...."

తలుపులు బిగ్గరగాబాదసాగాడు బాబు-

"హోంవర్క్ చేసుకో నాన్నా.... మంచి బాబువి కదూ...." నోట్‌బుక్స్, పెన్సిలు తెచ్చి ఇచ్చింది తల్లి-

"నేను రాయను పో...."

వాటిని విసిరేశాడు-

"ఏం అల్లరి? ఎందు కేడుస్తున్నాడు వీడు.... అరేయ్ హోంవర్క్ చేసుకోమన్నానా లేదా?...." అంటూ వచ్చాడు తండ్రి....

బెదురుగా చూస్తూనే.... "నేను చేసుకోను పో...." అన్నాడు బాబు-

కొడుకు తన మాట కెదురుచెబుతున్నాడని మండిపడ్డాడు సారంగపాణి.

ఈడ్చి చెంపమీద కొట్టాడు.

బాబు చెంప పట్టుకొని బిగ్గరగా ఏడ్వసాగాడు.

తల్లి అడ్డంవచ్చి వాణ్ణి డాబా పైకి తీసుకపోయింది.

"పిల్లలు నిల్చోమంటె నిల్చోవాలి... కూర్చోమంటె కూర్చోవాలి.... ఎదురు చెప్పారో వీపు పగులగొడ్తాను రాస్కెల్...." ఆగ్రహంతో తిట్టాడు తండ్రి.

"వాడు చదువుకొని, హోంవర్క్ చేసుకునేదాకా తిండి పెట్టకు...." అన్నాడు భార్యతో-

"ఛీ ఛీ.... వెధవ కొంప- ఎప్పుడూ అల్లరి.... ఏడుపు-" సినిమా పుస్తకాన్ని తీసుకుంటూ మొహం చిట్లించుకున్నాడు.

* * *

మధ్యాహ్నం దాకా బాబు ఏడుస్తూనే ఉన్నాడు. బలవంతంగా తల్లి అన్నం తినిపించింది....

ఏడుస్తూ అన్నం తింటూ అలాగే నిద్రబోయాడు బాబు....

* * *

భోజనం చేసి గడియారం వంక చూసుకున్నాడు సారంగపాణి. ఒక మిత్రుడు, తను సినిమాకు పోదాం అనుకున్నారు— తాజ్ హోటల్ ముందు అతనికోసం వెయిట్ చేస్తానని చెప్పాడు మిత్రుడు—

అతనికిచ్చిన టైం అవుతోంది కనుక గబగబా దుస్తులేసుకున్నాడు—

భర్త సినిమాకు తయారవుతున్నాడని కావేరికి తెలుసు— అతను జేబులు వెతుక్కోడం ఆమె గమనిస్తూనే ఉంది.

నెలాఖరు రోజులుకదా సరిపోయేన్ని డబ్బులు లేనట్టున్నాయి జేబుల్లో....

"ఏమన్నా డబ్బులున్నాయా?" భార్యను అడిగాడు.

లేవన్నట్టు తలూపింది.

"చూడు చూడు...."

"లేవండి. పొద్దున డబ్బాలన్నీ వెదికి కాఫీపొడి తెప్పించాను—"

భార్య మొహాన్ని పరిశీలనగా చూశాడు సారంగపాణి. ఆమె అదోలా ఉండటం గమనించాడు—

"ఏవిటో ఆ విచారం?...."

"ఏం లేదండి...."

"ఉందని మొహం చెబుతుంటే లేదంటావేం?...."

తలెత్తి భర్త కళ్ళలోకిచూసింది కావేరి.

"మన పరిస్థితులు.... అలవాట్లు జీవితంలో వేగాన్ని పెంచాయండి. ఆ వేగంలో పడి మనం బాబును నిర్లక్ష్యం చేస్తున్నామేమో అనిపిస్తున్నది...." అంది.

"ఏం నిర్లక్ష్యం చేశాం? ఇప్పుడు వాడికేం తక్కువైందని....?" ప్రశ్నార్థకంగా భార్యవైపు చూశాడు.

కావేరి మాట్లాడలేదు.

"ముందు డబ్బుల సంగతి చూడు— టైమవుతోంది." అన్నాడు తిరిగి—

"నిజంగా నా దగ్గర లేవండి...."

ఏదో గుర్తుకొచ్చినవాడిలా బెడ్‌రూం వైపు గబగబా నడిచాడు సారంగపాణి.

సూట్‌కేసులు తెరిచి చూశాడు. బట్టల అడుగున వెదికాడు. ఏవేవో కాగితాలు. రెండు మూడు రాగినాణాలు కనిపించాయి.

కావలిసినవి.... అతని ముఖాన్ని వికసింపజేసేవి మాత్రం కనిపించలేదు.

మూలకున్న పాతపెట్టె తెరిచాడు. అందులో దాచి మరిచిపోయిన డబ్బులు ఏమైనా దొరుకుతాయేమోనని ఆశ.

అది అతని బాల్యంనాటి చెక్కపెట్టె. అందులో పాత వస్తువులే కాదు....అతని చిన్ననాటి జ్ఞాపకాలూ పదిలంగా ఉన్నాయి....

మూత తెరవగానే ముందుగా కనిపించింది బొడ్డుచెంబు—

ఆ బొడ్డుచెంబుతో తండ్రి నీళ్ల

తాగిస్తుంటే తల్లి తనకు అన్నం తిని పించేది. ఒక్కొసారి తాను అన్నం తినననీ మారాం చేసేవాడు- తండ్రి బతిమిలాడి.... చెక్క బొమ్మలతో ఆడించి అన్నం తినిపించడం సారంగపాణి కళ్ళలో లీలగా కదిలింది.... ఎత్తుకొని అటు ఇటు తిప్పుతూ అన్నం తినిపించడం గుర్తుకొచ్చింది-

తనకు తండ్రి కాగితం పడవలు చేసివ్వడం, వెదురు బొంగుతో పిల్లనగ్రోవి చేసివ్వడం.... అగష్టు పదిహేను ప్రాతఃకాలం ప్రత్యేకంగా తనకు తండ్రి తలంటి స్నానం చేయించడం జ్ఞప్తికి వచ్చి అప్రయత్నంగా అతని కళ్లు చెమర్చాయి.

సాయంకాలం తనను దగ్గర కూర్చోబెట్టుకొని పలకమీద అక్షరాలు దిద్దించడం, ఎక్కాలు నేర్పించడం అతని మనసులో మెదిలింది. అవన్నీ మొన్నటి సంఘటనలుగా అతని మనఃఫలకాన్ని కదపాయి.

"నాన్నా! కథ చెప్పవూ...." అని రాత్రిపూట తండ్రి ఒడిలోకి ఒదిగొదిగి పడుకున్న రోజులు గుర్తుకొచ్చాయి సారంగపాణికి.

ఎన్నెన్నో కథలు.... నక్క కథలు, రాజుల కథలు, శివాజీగాథలు చెబుతుంటే తాను ఊఁ గొడుతూ అలాగే నిద్రలోకి జారుకునేవాడు. ఒక్కొసారి ఒక పెద్ద కథను పది రోజుల దాకా చెప్పేవారు.

తాను బి.కాం. కోసం హైద్రాబాద్ వస్తున్నప్పుడు వర్షంలో, చలిలో స్టేషను దాకా వచ్చి సాగనంపిన తండ్రి కళ్ళలో మెదిలాడు.

సారంగపాణి దృష్టి బొడ్డుచెంబు పక్కనున్న ఇత్తడి గ్లాసు మూలకు పడింది. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఆ బొడ్డు చెంబును ఇత్తడిగ్లాసును తాకుతుంటే తండ్రి ప్రేమను తాకుతున్నట్టుగా ఉంది సారంగపాణికి.

తాను స్కూలుకు వెళ్ళేముందు ప్రతి రోజు అగ్లాసులో నురగ వచ్చేదాకా పాలు తొర్లించి ఇచ్చేవారు నాన్న.

అప్పుడప్పుడు సాయంకాలం పూట కాలవగట్టుకు తీసుకపోయేవారు. వచ్చేప్పుడు రామా విలాస్‌లో రవ్వదోసె.... పెసరట్టు తినిపించేవారు....

బొడ్డుచెంబును, ఇత్తడి గ్లాసును చూస్తూ భర్త దీర్ఘాలోచనలో పడటాన్ని గమనించింది కావేరి....

వెనక్కు తిరిగిన సారంగపాణి దృష్టి పడుకున్న కొడుకుపై పడింది.

దగ్గరగా వెళ్ళాడు....

బాబు తన బాల్యానికి ప్రతిబింబంలా కనిపించాడు....

మరోసారి అతని బాల్యం కళ్లముందు కదిలింది.

దోసిలా బాబువంక చూశాడు....

బాబు చెక్కిలిమీది ఎరుపు మరకల్ని పశ్చాత్తాపంతో స్పృశించాడు....

———